# సాక్షి
## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 24 । మార్చి । 2025




**సోమశిలలో 54.343 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో ఆదివారం 54.343 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1,280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు) | రూ.90,730 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) | రూ.8,230 |
| 3శాతం జీఎస్టీతో | రూ.8,477 |
| నవర (8గ్రా) | రూ.67,816 |

గరిష్టం/కనిష్టం
35.2 /27.2

**వాతావరణం**

జిల్లాలో వాతావరణం సోమవారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 65 శాతంగా నమోదైంది.

**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| సోమవారం | మంగళవారం |
| సా: 6.22 | ఉ: 4.51 |

## న్యూస్‌రీల్

### కేజీబీవీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

- 6, ఇంటర్ తరగతులకు దరఖాస్తులు

**దుత్తలూరు:** కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశాలకు వేళయింది. 2025–26 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి జిల్లా సమగ్ర శిక్షా అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తులు చేసుకుని అర్హులైన బాలికలు ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశం పొందవచ్చు. జిల్లాలో 12 కేజీబీవీల్లో ఆంగ్ల మాధ్యమంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఒక్కొక్క పాఠశాలలో 40 సీట్లు భర్తీ చేయనున్నారు. ఒక్కొక్క కేజీబీవీకి ఒక ఇంటర్ కోర్సును కేటాయించి 40 సీట్లు కేటాయించారు. జిల్లాలోని ఉలవపాడు, కందుకూరు, వలేటివారిపాళెం, సీతారామపురం, కొండాపురం, కావలి కేజీబీవీల్లో ఎంపీసీ గ్రూపు, నందిపాడు, ఏఎస్‌పేట, గుడ్లూరు, లింగసముద్రం కేజీబీవీల్లో బైపీసీ, కలిగిరి, మర్రిపాడు కేజీబీల్లో ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు.

### సమష్టి కృషితోనే వెలుగొండ జలాలు సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంప్రసాద్

**ఉదయగిరి:** నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల ప్రజలు ఉద్యమిస్తేనే వెలుగొండ జలాశయం పూర్తయి సాగు, తాగు నీరు అందుతాయని వెలుగొండ ప్రాజెక్ట్ జలాల సాధన సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక షాదీ మంజిల్‌లో ఆదివారం వెలుగొండ ప్రాజెక్టు జలాల సాధన సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెలుగొండ జలాశయం పూర్తయితే మూడు జిల్లాల్లోని 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 25 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతాయన్నారు. 29 ఏళ్ల క్రితం పనులు ప్రారంభమైనా ఇంకా కొనసాగుతుండడం చూస్తే ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని తేటతెల్లమవుతోందన్నారు. ఏపీ అంటే ఒక అమరావతో, ఒక పోలవరమో కాదని, అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తికి రూ.7 వేల కోట్లు అవసరం కాగా, ఈ ప్రభుత్వం కేవలం రూ.309 కోట్లు ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించడం దారుణమన్నారు. కేవలం ఏడు వేల కోట్లతో వెలుగొండ ద్వారా మూడు జిల్లాల మెట్ట ప్రాంతాలకు జలాలు అందించే అవకాశం ఉంటే.. రూ.80 వేల కోట్లు పెట్టి గోదావరి జలాలను మెట్ట ప్రాంతాలకు తీసుకొస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు సాధన కోసం రాజకీయ నేతలు, మేధావులు, రైతులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రజలు ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. ఈ ప్రాజెక్ట్ ఆవశ్యకతపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసీరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో సీపీఎం, సీపీఐతో పాటు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్, ఎం.రమేష్, దామా అంకయ్య, అజయ్‌కుమార్, బసిరెడ్డి మాలకొండారెడ్డి, దస్తగిరి అహ్మద్, ఫట్స్ రమణయ్య, కామేపల్లి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

### అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

**నెల్లూరు సిటీ:** అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి తన ఇంట్లోనే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో టిడ్కో హౌసింగ్ కాంప్లెక్స్‌లో జరిగింది. పోలీసులకు సమాచారం మేరకు.. బ్లాక్ నంబర్ సీ 28లో సర్దార్ బాషా (32) ఒంటరిగా నివసిస్తున్నారు. మద్యానికి బానిసైన సర్దార్ బాషా శనివారం రాత్రి పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చి నిద్రపోయాడు. ఆదివారం పక్క ఫ్లాట్‌లోని వ్యక్తి వచ్చి ఎన్నిసార్లు తలుపుతట్టినా తెరవకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే బాషా నోట్లో నుంచి నురగ వచ్చి మృతి చెందాడు. నవాబుపేట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పాపం టీడీపీది శాపం ఫ్యాక్టరీకి

- ఉద్యోగులు, కార్మికులు, రైతులకు రూ.కోట్లలో బకాయిలు
- 2004లో అప్పటి సీఎం వైఎస్సార్ హయాంలో అన్ని బకాయిలు చెల్లింపు
- ఫ్యాక్టరీని పునః ప్రారంభించిన వైనం
- 2013లో మళ్లీ మూతపడిన పరిస్థితి
- ఫ్యాక్టరీని తెరిపిస్తానని యువగళం పాదయాత్రలో లోకేశ్ హామీ
- అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఆ ఊసే లేదు

## 1999లో ప్రైవేటీకరణ జపంలో మూసివేత

**జిల్లాకే తలమానికంగా కో–ఆపరేటివ్ రంగంలో ఏర్పాటైన కోవూరు షుగర్ ఫ్యాక్టరీ టీడీపీ హయాంలో చంద్రబాబు అందుకున్న ప్రైవేటీకరణ జపంతో మూత పడింది. దీంతో వందలాది ఉద్యోగ, కార్మిక కుటుంబాలు, వేలాది రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆ తర్వాత ప్రతి ఎన్నికల్లోనూ చంద్రబాబు ఈ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ వాగ్దానాలు చేశారే తప్ప పట్టించుకోలేదు. తాజాగా అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నా ఆ ఊసే లేదు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కోవూరు షుగర్ ఫ్యాక్టరీపై అసత్యాలు మాట్లాడడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**



కోవూరు షుగర్ ఫ్యాక్టరీ

**కోవూరు:** జిల్లాలో డెల్టా ప్రాంతమైన కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలో 1979 ఫిబ్రవరిలో 124 ఎకరాల విస్తీర్ణంలో కోవూరు షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. రోజుకు 1,250 మెట్రిక్ టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ప్రారంభించిన ఫ్యాక్టరీ.. కాలక్రమంలో చెరకు సాగు విస్తీర్ణం పెరగడంతో రోజుకు 2,500 మెట్రిక్ టన్నుల క్రషింగ్ సామర్థ్యానికి చేరింది. జిల్లాలో కోవూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెంతోపాటు పొదలకూరు, నాయుడుపేట తదితర ప్రాంతాల్లో సుమారు 10 వేల మంది రైతులు చెరకు సాగు చేపట్టారు. వందలాది మంది కార్మికులతో రేయింబవళ్లు ఫ్యాక్టరీ వైభవంగా నడిచేది. 1996లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా కోఆపరేటివ్ రంగంలోని షుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరణ చేయాలనే జపంతో వాటి మనుగడను నిర్వీర్యం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే 1999లో కోవూరు షుగర్ ఫ్యాక్టరీని మూసివేశారు. అప్పటికే ఫ్యాక్టరీకి చెరకు తోలిన రైతులకు కోట్లాది రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నా.. రూపాయి చెల్లించకుండా మూతవేశారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీ లో శాశ్వత, క్యాజువల్ ఉద్యోగులు, కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. కనీసం వారికి పరిహారం కూడా ఇవ్వకపోడంతో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి.

**2004లో పునఃప్రారంభించిన వైఎస్సార్**

కోవూరు షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితిని తెలుసుకున్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారమే 2004లో క్రషింగ్ సీజన్‌కు ముందే రైతులు, ఉద్యోగులు, కార్మికులకు చెల్లించాల్సిన కోట్లాది రూపాయల బకాయిలను చెల్లించారు. ఫ్యాక్టరీ మెషినరీ తుప్పు పట్టిపోవడంతో నిధులు కేటాయించి పునరుద్ధరణ చేశారు. అప్పటి నుంచి సజావుగా నడుస్తున్న షుగర్ ఫ్యాక్టరీ వైఎస్సార్ అకాల మరణంతో ఒడిదొడుకులకు గురైంది. నష్టాలో ఊబిలో కూరుకుపోవడంతో 2013లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో అర్ధాంతరంగా మూత పడింది.

**2014 ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం**

2014 ఎన్నికల ప్రచారంలో కోవూరుకు వచ్చిన చంద్రబాబు షుగర్ ఫ్యాక్టరీని తాను తిరిగి పునరుద్ధరించి రైతులకు, కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు షుగర్ ఫ్యాక్టరీ విషయాన్ని విస్మరించారు. కమిటీల పేరుతో రైతులు, ఉద్యోగులు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండా 2014 నుంచి 2019 వరకు ఐదేళ్లు కాలయాపన చేశారు.

**చెరకు సాగు నిలిచిపోవడంతో..**

దాదాపు ఏడెనిమిదేళ్లుగా ఫ్యాక్టరీ మూతపడిపోవడంతో జిల్లాలో చెరకు సాగును రైతులు పూర్తిగా మానేశారు. తిరిగి ఫ్యాక్టరీ ప్రారంభించినా చెరకు పంట అందుబాటులో లేని కారణంగా క్రషింగ్ అసాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన నిపుణల కమిటీ నివేదికలో పేర్కొంది. గతంలో చెరకు సాగు చేసిన భూముల్లో ప్రత్యామ్నాయంగా వరి సాగు చేస్తుండడంతో ప్రస్తుత పరిస్థితుల్లో ఫ్యాక్టరీని పునరుద్ధరణ చేసినా మళ్లీ మూతపడే పరిస్థితి అనివార్యమవుతుందని కమిటీ స్పష్టం చేసింది.

**యువగళంలో లోకేశ్ హామీ**

కోవూరు షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి తిరిగి పూర్వ వైభవాన్ని తెస్తానని లోకేశ్ ఎన్నికల ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరిస్తామని, ఉద్యోగులు, కార్మికుల వేతనాల బకాయిలు చెల్లిస్తామని గొప్పలు చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నా ఆ ఊసేలేదు. తాజాగా స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో గత ప్రభుత్వం, గత ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఫ్యాక్టరీ మూత పడడానికి తాను అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వమే కారణమని తెలుసుకోకుండా, అధికారంలో ఉండి పది నెలలుగా అసమర్థత ప్రదర్శిస్తూ గత ప్రభుత్వం, పాలకులపై నెపం నెట్టి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వైఎస్సార్‌సీపీ హయాంలో పునరుద్ధరించే యత్నం**

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో షుగర్ ఫ్యాక్టరీపై ఆశలు చిగురించాయి. అప్పటి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ప్రాధాన్యతను, రైతులు, ఉద్యోగుల బకాయిల విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి వివరించారు. దీంతో ఫ్యాక్టరీని పునః ప్రారంభించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్నాహాలు చేశారు. అందులో భాగంగా ఫ్యాక్టరీ స్థితిగతులు తెలుసుకునేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ ఫ్యాక్టరీలోని యంత్రాలను పరిశీలించింది. 2013 నుంచి ఫ్యాక్టరీ మూతపడిపోవడంతో యంత్రాలు వినియోగపడవని నిర్ధారించింది. ఫ్యాక్టరీ పునః ప్రారంభించడం అంటే ప్రస్తుత పరిస్థితుల్లో వందల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తుందని కమిటీ స్పష్టం చేసింది.



కోవూరు షుగర్ ఫ్యాక్టరీలో తుప్పు పట్టి నిరుపయోగంగా ఉన్న యంత్రాలు

### ఎంతో ఘన చరిత్ర



కోవూరు చక్కెర కర్మాగారానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. ఆనాడు ఫ్యాక్టరీని నమ్ముకుని ఎంతో మంది సంతోషంగా జీవించారు. నేను 40 ఎకరాల్లో చెరకు పంట వేసి ఫ్యాక్టరీకి సరఫరా చేశాను. ఆనాడు ఫ్యాక్టరీ నిర్మాణంలో ఎందరో పెద్దలు, భూస్వాముల కృషి ఉంది. 3,184 మంది షేర్ హోల్డర్లు అందరూ ఒకతాటిపై నిలబడి ఫ్యాక్టరీని కాపాడుకున్నారు.

– రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, చెరకు రైతు, పడుగుపాడు

### చెరకునే నమ్ముకుని పంటలు సాగు చేశాం



కోవూరు చక్కర కర్మాగారాన్ని నమ్ముకుని ఎన్నో ఏళ్లు చెరకు పంట సాగు చేశాం. ఫ్యాక్టరీ మూసివేసిన తర్వాత పక్క జిల్లాల్లోని ఫ్యాక్టరీలకు చెరకు తోలాం. ఆ తర్వాత చెరకు సాగు మానేసి ఇతర పంటలు సాగు చేస్తున్నాం. ప్రస్తుతం అది మూతపడి శిథిలావస్థకు చేరుకుంటే చూసినప్పుడల్లా ఎంతో బాధగా అనిపిస్తోంది. నేను 35 ఎకరాలు చెరకు పంట వేసి ఫ్యాక్టరీకి సరఫరా చేశాను.

– పొన్నవోలు సుధీర్‌రెడ్డి, చెరకు రైతు, ఇనమడుగు

### పూర్వవైభవం తీసుకురావాలి



కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకు రావాలి. రాష్ట్రంలో కోవూరుతోపాటు చాలా ఫ్యాక్టరీలు విజయవంతంగా నడిచాయి. ఇక్కడి ఫ్యాక్టరీ పరిస్థితి చూస్తుంటే బాధగా ఉంటుంది. పాలకులు ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి. గతంలో నేను 30 ఎకరాల్లో చెరకు సాగు చేసే వాడిని. ఫ్యాక్టరీపైన ఆధారపడి జీవించే ఎంతో మంది బతుకుదెరువు కోల్పోయారు.

– కొలనకుదురు చంద్రశేఖర్‌రెడ్డి, చెరకు రైతు, పడుగుపాడు

# మా ఊరే మాకు ముఖ్యం

**ఊరు ప్రజల భద్రత, పంటలు, భూగర్భ జలాల సంరక్షణే లక్ష్యంగా ఆ గ్రామస్తులు పదేళ్లుగా పార్టీలకు అతీతంగా స్వీయ ఆంక్షలు విధించుకుని కట్టుబడి ఉన్నారు. సొంత అవసరాలకు సైతం దూర ప్రాంతాల నుంచి ఇసుక తెచ్చుకోవాలని చేసుకున్న తీర్మాన ప్రతిని కలెక్టర్‌కు అందజేసి, ఈ నాటికీ ఆ తీర్మానం మేరకు నడుచుకుంటున్నారు. ఊరు, ప్రజలు ఎటుపోతే మనకెందుకు మన జేబులు నిండితే చాలనుకునే నేటి రోజుల్లో.. మా ఊరే మాకు ముఖ్యమంటున్న పొదలకూరు మండలంలోని మహ్మదాపురం గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది.**

**ఇసుక తవ్వకాలపై స్వీయ ఆంక్షలు**

- పార్టీలకతీతంగా పదేళ్లుగా గ్రామస్తుల కట్టుబాటు
- సొంత అవసరాలకూ ఇసుక తరలించమని తీర్మానం
- పదేళ్ల క్రితమే కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత
- భూగర్భ జలాల పరిరక్షణకే అంటున్న మహ్మదాపురం వాసులు



మహ్మదాపురం పక్కనే ఉన్న పెన్నానదిలో ఇసుక

**పొదలకూరు:** పెన్నానది పరీవాహక ప్రాంతంలో ఉన్న మండలంలోని మహ్మదాపురం గ్రామ ప్రజలు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రకృతి వనరులను, భూగర్భ జలాలను సంరక్షించుకోవడమే కాకుండా తమ ఊరు ప్రజలు, తమ పంట పొలాల భద్రతను కాంక్షించి పదేళ్లుగా ఆ గ్రామ ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఒకే మాటపై కట్టుబడి ఉన్నారు. తమ ఊరికి చెంతనే ఉన్న పెన్నాలో ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, పంట పొలాలు, పల్లెల్లోని ఇళ్లు దుమ్ముకొట్టుకుని నాశనమై పోతాయని భావించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుకను ఎవరూ ఆఖరికి గ్రామస్తులు సైతం తరలించడానికి సమ్మతించేది లేదని పార్టీలకు అతీతంగా తీర్మానం చేశారు. ఆ తీర్మాన ప్రతిని అప్పటి కలెక్టర్‌కు అందజేసి తమ కట్టుబాటును తెలియజేశారు. ఎక్కడా లేని ఇసుక సంపద మహ్మదాపురం పెన్నా పరీవాహ ప్రాంతంలో ఉంది. ఇసుకాసురులు కళ్లన్నీ ఈ ప్రాంతంలోనే ఉన్నా గ్రామస్తుల స్వీయ ఆంక్షల నేపథ్యంలో మహ్మదాపురం ఇసుక రీచ్‌ను ఎవరికీ అప్పగించకుండా రక్షించుకుంటున్నారు. చెంతనే ఉన్న విరువూరు, సూరాయపాళెం రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక తరలిపోతున్నా అక్కడ అడిగే నాథుడు లేడు. మహ్మదాపురం రైతులు, గ్రామస్తులు మాత్రం పర్యావరణ పరిరక్షణ స్ఫూర్తితో తమ రీచ్ నుంచి ఇసుక రేణువు కూడా తరలి వెళ్లేందుకు వీలులేదని పదేళ్ల క్రితమే ఆంక్షలు విధించడంతో అధికారులు, పాలకులు సైతం ఈ ప్రాంతంలో అడుగు పెట్టేందుకు సాహసించలేకపోతున్నారు.

**భూగర్భ జలాల కోసం**

పెన్నా పరీవాహక ప్రాంతంలో ఇసుకను ఇష్టానుసారం తోడేస్తే భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని గ్రహించిన మహ్మదాపురం గ్రామ రైతులు ఇసుకను రక్షించుకుంటే చుట్టూ ఉన్న పచ్చని పంటలు, పొలాలను కాపాడుకోవడం కష్టం కాదని భావించి స్వీయ నియంత్రణ పాటిస్తూ పార్టీలతో పనిలేకుండా ఇసుక రీచ్‌ను కొనసాగించకుండా అడ్డుకున్నారు. దీంతో గ్రామ పొలాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. పదేళ్ల క్రితం పచ్చని పంటల మధ్యలో బాటలు, గ్రామ వీధుల మీదుగా ఇసుక ట్రాక్టర్లు రీచ్‌ను మెయిన్ రోడ్డుకు వచ్చేవి. దీంతో దుమ్ము దూళితో పచ్చని పంటలు దెబ్బతినడంతోపాటు, గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ఫలితంగా అందరూ ఏకమై పంచాయతీ ద్వారా ఇసుకను తరలించేందుకు వీలు లేదని తీర్మానం తయారు చేసుకున్నారు. గ్రామస్తుల అవసరాలకు ఇసుకను టైరు బండ్లలో తరలించుకునేందుకు కొంత మేర వెసులుబాటు కల్పించినా ఆ తర్వాత గ్రామస్తులు కూడా ఇసుకను వినియోగించుకునేందుకు లేదని ఈ ఏడాది తీర్మానం చేశారు. గ్రామస్తులు సైతం తీర్మానాన్ని అతిక్రమించకుండా ఇసుక అవసరమైతే పక్కనే ఉన్న విరువూరు, సూరాయపాళెం రీచ్‌ల నుంచి ఇసుకను తోలుకుంటున్నారు.



పొలాల మీదుగా వెళ్లే రోడ్డు

**ఇసుక తరలిస్తే ఇబ్బంది**



ఇసుక తరలిస్తే ముందుగా ఎస్సీ కాలనీ వాసులకు ఇబ్బంది. మా కాలనీ మీదుగానే ట్రాక్టర్లు, లారీలు వెళ్లాల్సి ఉంటుంది. కనుకనే నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలోనే ఇసుక రీచ్ వద్దని తీర్మానం చేయడం జరిగింది.

– జీ ఆనంద్, మాజీ సర్పంచ్, మహ్మదాపురం

**గ్రామ శ్రేయస్సే ముఖ్యం**



మాకు గ్రామ శ్రేయస్సే ముఖ్యం. కనుకనే ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయనీయకుండా అడ్డుకోవడం జరిగింది. ఇందుకు సంబంధించి తీర్మానాన్ని అప్పట్లో కలెక్టర్‌కు అందజేశారు. మా గ్రామంలో రాజకీయ పార్టీలు ఉన్నా ఇలాంటి అంశాలపై ఏకతాటిపై నడుస్తాం.

– గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్, మహ్మదాపురం

**గ్రామస్తులు కూడా తోలుకోవడం లేదు**



గ్రామస్తులు సైతం ఇసుకను తోలుకోవడం లేదు. అవసరమైన వారు పక్క రీచ్‌ల నుంచి తోలుకుంటున్నారు. గతంలో కలెక్టర్‌కు కూడా ఇదే విషయంపై వినతిపత్రం అందజేశారు. గ్రామం కోసం అందరం ఐకమత్యంగా నిర్ణయం తీసుకోవడం జరిగింది.

– కరిపరెడ్డి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్, మహ్మదాపురం

**రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే..**




రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పార్టీలు, వర్గాలతో సంబంధం లేకుండా ఇసుక రీచ్‌ను నిలిపివేయడం జరిగింది. పంటలు, పొలాలు ఇప్పుడు బాగున్నాయి. ఇసుక తరలిస్తే దుమ్మూదూళి వల్ల పంటలు దెబ్బతినేవి.

– కే.రమణారెడ్డి, రైతు, మహ్మదాపురం

### హామీలు మరిచి అవాస్తవాల ప్రచారం

- కూటమి సర్కార్‌పై ఎమ్మెల్సీ పర్వతరెడ్డి ధ్వజం



**నెల్లూరు(బారకాసు):** ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుండా, టీడీపీ నేతలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న సిటీ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 17 మంది వీసీలను బెదిరించి రాజీనామాలు చేయించి తొలగించిందన్నారు. ఈ విషయంపై తాము ఆధారాలు బయటపెడితే విచారణ జరుపుతామని చెప్పిన మంత్రి లోకేశ్ ఇప్పటికీ విచారణ జరపకుండా సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 2023–24 సంబంధించి మూడు క్వార్టర్స్ 2024–25 ఏడాదికి సంబంధించి మూడు క్వార్టర్స్ మొత్తం ఆరు క్వార్టర్స్ బకాయిలు రూ.5,252 కోట్లు టీడీపీ ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందన్నారు. అలాగే వసతి దీవెనకు సంబంధించి రూ.2 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందన్నారు. ఈ బకాయిలన్నీ విడుదల చేయకుండా జగన్‌మోహన్‌రెడ్డి మీద అవాస్తవాలు మాట్లాడుతూ కాలయాపన చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు ప్రవేశపెట్టి 45 వేల ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని అప్పటి వరకు ప్రతి ఒక్క నిరుద్యోగికి భృతి అందిస్తామని చెప్పి ఇప్పుడు వారిని నిలువునా దగా చేసిందన్నారు. పూర్తిగా ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రోడ్డు పాలు చేశారన్నారు. టీడీపీకి ఓటు వేసి తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారని, మరలా ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## క్లుప్తంగా

### వీనులవిందుగా గాత్రకచేరి



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలో త్యాగరాజ స్మరణోత్సవాలను భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో విశేషంగా నిర్వహిస్తున్నారు. స్వామివారు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి అలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. కేరళకు చెందిన విష్ణుదేవ్ నంబూద్రి గాత్రకచేరి వీనులవిందుగా సాగింది. 120 మందికిపైగా స్థానిక ఔత్సాహిక కళాకారులతో గాత్ర, వీణకచేరీలు మధురంగా సాగాయి. స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవీప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

### కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



ఉదయగిరి: కుక్కలు దాడి చేయడంతో తాగునీటి కోసం జనావాసాల్లోకి వచ్చిన చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన మండలంలోని మాసాయిపేటలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి చుక్కల దుప్పి రావడంతో కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు గమనించి దుప్పిని రక్షించి అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. సిబ్బంది అక్కడికి చేరుకొని పరిశీలించగా, దుప్పి అప్పటికే మృతి చెందిందని గుర్తించారు. అనంతరం గండిపాళెం పశువైద్యశాలకు తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. గన్నేపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో దుప్పిని ఖననం చేశారు.

### గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో..



రోడ్డుపై మృతదేహం


ముత్తుకూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన ముత్తుకూరు – నెల్లూరు రోడ్డులోని తాళ్లపూడి వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రోడ్డుపై నడుచుకొని వెళ్తుండగా, వాహనం ఢీకొనడంతో మృతి చెందారు. మృతుడికి 50 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

### పూటుగా మద్యం సేవించి.. నిద్రలోనే కన్నుమూసి



నెల్లూరు సిటీ: పూటుగా మద్యం సేవించి నిద్రలోనే వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని రామచంద్రాపురంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. రామచంద్రాపురంలో సాయి అనసూయమ్మ ఇంట్లో ఓ గదిని బాడుగకు తీసుకొని శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పెద్దబ్బాయి (65) పది నెలలుగా నివాసం ఉంటున్నారు. నగరంలో కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మద్యం సేవించి తన గదిలో శనివారం నిద్రించారు. ఈ తరుణంలో తలుపును యజమాని తట్టగా, తీయకపోవడంతో అనుమానం వచ్చి పగలగొట్టి చూడగా పెద్దబ్బాయి విగతజీవిగా పడి ఉన్నారు. మద్యాన్ని అధిక మొత్తంలో సేవించి అపస్మారక స్థితికి చేరుకొని మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


### కండలేరులో నీటి నిల్వ



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 49.74 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 7800, లోలెవల్ కాలువకు 30, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు ఐదు క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

### నిమ్మ ధరలు పొదలకూరు (కిలో)


పెద్దవి: రూ.75
సన్నవి: రూ.55
పండ్లు: రూ.30



# నిర్లక్ష్యం వహిస్తే క్షయ.. క్షోభే

## ఆరోగ్యం బేజారయ్యే అవకాశం శారీరకంగా, ఆర్థికంగా కుంగుబాటు

జిల్లాలో గతంలో తగ్గుముఖం పట్టిన క్షయ (టీబీ) కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. ఆహార లోపంతో బాధపడేవారు, మురికివాడల్లో ఉండే పేదలకు ఈ వ్యాధి వేగంగా సోకుతోంది. ఓ వ్యక్తి నుంచి మరొకరికి అంటువ్యాధిగానూ వ్యాపిస్తోంది. దీని బారినపడిన వారికి రోజూ బలవర్థకమైన ఆహారాన్ని అందించాల్సి ఉండటంతో ఆ కుటుంబంపై ఆర్థిక భారమూ పడుతోంది. ఖరీదైన మందులను ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు క్రమం తప్పకుండా వినియోగించాలి. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా, అది ప్రాణాంతకమయ్యే ప్రమాదం లేకపోలేదు.






చికిత్స పొందుతున్న రోగులు


నెల్లూరు(అర్బన్): క్షయతో ఆరోగ్యం గుల్లవుతుంది. చాపకింద నీరులా జిల్లాలో ఇది వ్యాపిస్తుండటం కలవరానికి గురిచేస్తోంది. తుమ్మినా, దగ్గినా ఆ తుంపర్లు పక్కవారిపై పడితే అందులోని సూక్ష్మజీవుల ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. శరీరంలోని ఏ భాగానికైనా ఇది రావొచ్చు. జిల్లాలో 16 వేల మంది వరకు రోగులున్నారని ఐఎంఏ లెక్కల ద్వారా తెలుస్తోంది. ప్రభుత్వ వైద్యశాలల ద్వారా గుర్తించిన కేసులే వైద్యశాఖ రికార్డుల్లో ఉంటున్నాయి. అదే ప్రైవేట్ హాస్పిటళ్లలో గుర్తించే కేసుల వివరాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. వ్యాధి విషయాన్ని తెలియకుండా చూడాలని పలువురు రోగులు కోరుతుండటమే దీనికి కారణమని తెలుస్తోంది. వ్యాధి బారినపడి ఏటా 80 నుంచి 100 మంది వరకు మృత్యువాత పడుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు.

**నిర్లక్ష్యం వహిస్తే మొదటికి**

టీబీ సోకిన వారు ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు మందులను వినియోగించాల్సి ఉంటుంది. ఆ సమయంలో మంచి పౌష్టికాహారాన్ని తీసుకుంటే వ్యాధి తగ్గుతుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా.. కొంతకాలం మందులు వాడి ఆపేసినా మళ్లీ మొదటికొచ్చే ప్రమాదం ఉంది. తదుపరి టీబీ ముదిరి, ఏడాది నుంచి రెండేళ్ల పాటు మందులను వాడాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. అధికారిక లెక్కల మేరకు ప్రస్తుతం 24 మందికి ఇలా మారిందని సమాచారం. ఐదేళ్లలోపు పిల్లలకు సోకితే వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

### వ్యాధికి ప్రధాన కారణాలు..

టీబీని మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌కులోసిస్ అనే సూక్ష్మజీవి కలిగిస్తోంది. హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో బాధపడేవారు, పౌష్టికాహార లోపంతో బలహీనంగా ఉండేవారు, వ్యాధి నిరోధక శక్తిని తగ్గించే స్టెరాయిడ్స్‌ను వినియోగించే వారికి ఇది సోకుతోంది. ఊపిరితిత్తులకు ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. మద్యం, ధూమపానం అలావాటుండే వారు, షుగర్ వ్యాధిగ్రస్తులకు త్వరగా వచ్చే అవకాశం ఉంది.



### ఇవీ లక్షణాలు..

రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం రావడం, గళ్ల పడటం, అందులో రక్తపు ధారలుండటం, బరువు తగ్గిపోవడం లాంటి లక్షణాలుంటే టీబీగా అనుమానించి పరీక్షలు చేయించుకోవాలి. మెడ, గొంతు, చెంపపై చెవి కింద, చర్మంలోపల గడ్డలుంటే వ్యాధిగా అనుమానించాలి. ఇంట్లో ఎవరికైనా వస్తే, మరొకరికి సోకకుండా తగు జాగ్రత్తలు పాటించాలి.

### జాగ్రత్తలు తప్పనిసరి



టీబీపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. నాట్ వంటి కొత్త పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కఫం పరీక్షలు చేస్తున్నారు. వ్యాధిగా నిర్ధారణైతే జాగ్రత్తలు పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు వాడితే నయం చేయొచ్చు.

– గౌరీనాథ్, పల్మనాలజిస్ట్, ఎనెల్ స్పెషాల్టీ ఆస్పత్రి, నెల్లూరు

### నాణ్యమైన వైద్యసేవలు



టీబీని నివారించడమే లక్ష్యంగా నాణ్యమైన సేవలను ప్రభుత్వం అందిస్తోంది. ఖరీదైన మందులను ఇంటి వద్దే రోగికి అందేలా చూస్తున్నాం. అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో పరీక్షలను ఉచితంగా చేస్తున్నాం.

– ఖాదర్‌వలీ, జిల్లా టీబీ నియంత్రణాధికారి

**రోగులకు భరోసాగా..**

టీబీ సోకిన వారికి జిల్లా టీబీ నివారణ శాఖ ఆధ్వర్యంలో ఖరీదైన మందులను ప్రతి నెలా క్రమం తప్పకుండా అందజేయడంతో పాటు మింగిస్తున్నారు. వ్యాధికి గురైన వారు పనులకు దూరంగా ఉండాల్సిన తరుణంలో పౌష్టికాహారం కోసం రూ.వెయ్యిని వారి ఖాతాలో ప్రభుత్వం జమచేస్తోంది. రోగిని ప్రైవేట్ డాక్టర్లు గుర్తించి సమాచారమందిస్తే సదరు వైద్యుడికి ప్రోత్సాహకంగా రూ.500ను అందజేస్తున్నారు. చికిత్స పూర్తయ్యాక మరో రూ.500, డాట్ పద్ధతిన రోగితో మందులు మింగించినందుకు ఆరోగ్య కార్యకర్తలకూ ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నారు.

### పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన లారీ

• తప్పిన ఘోర ప్రమాదం



సంగం: పెట్రోల్ బంకులోకి లారీ దూసుకెళ్లిన ఘటన సంగం కొండ కూడలి వద్ద గల జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. కొండపైనుంచి వేగంగా వస్తున్న లారీ అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో బంకు ముందున్న చిరు వ్యాపారుల తోపుడు బండ్లు నుజ్జునుజ్జయ్యాయి. వరికోత యంత్రాలు, బంకు ముందు భాగం స్వల్పంగా దెబ్బతిన్నాయి. పెను ప్రమాదం తప్పడంతో పలువురు ఊపిరిపీల్చుకున్నారు. ఘటన స్థలానికి చేరుకొని వివరాలను పోలీసులు సేకరించారు. సుమారు రూ.మూడు లక్షల మేర నష్టం వాటిల్లింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కారు ఢీకొనడంతో వాహనచోదకుడి దుర్మరణం



వెంకటాచలం: కారు ఢీకొనడంతో వాహనచోదకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరు నుంచి గూడూరు వైపు బైక్‌పై 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి వెళ్తుండగా, వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఖోఖోలో చిచ్చర పిడుగులు

• కష్టాలను అధిగమించి.. రాణిస్తూ
• జాతీయ పోటీలకు ఎంపిక

తమ ఆశయానికి కష్టాలు ఏ మాత్రం అడ్డు కాదని నిరూపించారు బీవీనగర్‌కు చెందిన రమ్య, భార్గవి. తల్లిదండ్రులు రోజు వారీ కూలీలైనా.. ఆర్థిక కష్టాలను అధిగమించి ఖోఖోలో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. స్టేడియం వద్దకు ఉదయం, సాయంత్రం వేళ క్రమం తప్పకుండా వచ్చి సాధన చేశారు. జిల్లా, రాష్ట్ర, సీనియర్స్ జాతీయ స్థాయి పోటీల్లో తమ ప్రతిభను మెరుగుపర్చుకున్నారు. చిన్న వయస్సులోనే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసేందుకు కృషి చేస్తున్నారు.

– నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)



ఉత్సాహంగా తలపడుతూ..

### ఎంతో మంది సహకారమందించారు

చిన్నారుల ప్రతిభను గుర్తించిన డీఎస్డీఓ యతిరాజ్, ఖోఖో అసోసియేషన్ నేతలు గురుప్రసాద్, గిరిప్రసాద్, విజయ్‌కుమార్ ఆర్థికంగా సహకారం అందించారు. వీరికున్న పట్టుదలే ఉన్నత స్థాయికి తీసుకొచ్చింది. ఎప్పటికైనా ఇండియన్ టీమ్‌కు ఆడాలనే వీరి సంకల్పం నెరవేరాలని కోరుకుంటున్నా.

– సుకుమార్, కోచ్

### భళా..రమ్య



బీవీనగర్‌కు చెందిన రమ్య తల్లిదండ్రులు ఈశ్వర్‌రావు, గౌరీ రోజువారీ కూలీలు. ఎనిమిదేళ్ల వయస్సులో వేసవి శిక్షణ శిబిరానికి మొదటిసారిగా రమ్య హాజరయ్యారు. కేఎన్నార్ స్కూల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు.. డీకేడబ్ల్యూ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూనే ఐదు సబ్ జూనియర్స్ నేషనల్స్, సీనియర్ నేషనల్స్, పశ్చిమ బెంగాల్‌లో 2023లో నిర్వహించిన ఖేలో ఇండియా పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించారు. ఒడిశాలోని అకాడమీలో శిక్షణ పొందుతున్నారు.

### భేష్.. భార్గవి



భార్గవి తల్లిదండ్రులు చిన్నారావు, చిన్నమ్మ రోజు వారీ కూలీలు. భార్గవి కేఎన్నార్‌లో హైస్కూల్ విద్య అనంతరం జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో అండర్ –17లో రాణించారు. జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమంగా రాణించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఒడిశాలో ఈ నెల 31 నుంచి నిర్వహించనున్న నేషనల్స్‌కు వీరిద్దరూ ఎంపికయ్యారు.

# మైనార్టీల సంక్షేమమే జగన్ ధ్యేయం

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
• ఇఫ్తార్ విందుకు హాజరు



ప్రార్థనలు చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: ముస్లింల సంక్షేమానికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను అమలు చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముత్తుకూరులోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలను ఆదివారం ఆయన నిర్వహించారు. మైనార్టీ నేత అబ్దుల్ రహీమ్, ఎంపీటీసీ సభ్యుడు నవీద్‌బాషా, బడాభాయ్ తదితరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన కాకాణి మాట్లాడారు. ముస్లింలకు అండగా ఉంటామన్నారు. తొలుత కాకాణికి ఘన స్వాగతం పలికారు. పార్టీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, సీపారెడ్డి రామ్మోహన్‌రెడ్డి, దువ్వూరు కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో వ్యవహరించండి



మాట్లాడుతున్న వెంకటసుబ్బారావు

నెల్లూరు సిటీ: డాక్యుమెంట్ రైటర్లు నిబద్ధతతో వ్యవహరించి రిజిస్ట్రేషన్లు చేయించాలని దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెనుమాక వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారం తెలిస్తే మీడియా లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్స్‌లు ఉన్నప్పుడు ఈ సమస్యే ఉండేది కాదని, అయితే ఇప్పుడు ఎవరుపడితే వారు ముందుకొస్తున్నారని చెప్పారు. ఐకమత్యంతో ఉంటేనే రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరుగుతాయని పేర్కొన్నారు. ఎనీ వేర్ రిజిస్ట్రేషన్ విధానంలో సబ్ రిజిస్ట్రార్ ఓకే చేసే ప్రక్రియకు స్వస్తి పలికేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సంక్షేమ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి సుధాకర్, రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు సీతాపతిరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న తులసీరెడ్డి

ఉదయగిరి: టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని అంశాల్లో విఫలమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసీరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఉదయగిరిలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ పేరిట హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం, డ్రగ్స్, గంజాయి ఏరులై పారుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతోందని గత ప్రభుత్వంతో పోలిస్తే ఎక్కువ అప్పులు చేస్తోందని మండిపడ్డారు. నేతలు అనిల్‌కుమార్‌రెడ్డి, మద్దూరు రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.